# రోడ్డెక్కిన వైద్యులు

- నిందితులను ఉరి తీయాలని డిమాండ్
- నల్ల బ్యాడ్జీలు ధరించి నిరస తెలిపిన వైద్య సిబ్బంది
- ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో ఓపీ సేవలు బంద్
- ఇబ్బందులు ఎదుర్కొన్న పేషెంట్లు



కామారెడ్డిలోని ప్రభుత్వ ఏరియా దవాఖాన వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

కామారెడ్డి/బాన్సువాడ/ఎల్లారెడ్డి/మద్నూర్/బిచ్కుంద, ఆగస్టు 17 : కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన లైంగికదాడి, హత్యను నిరసిస్తూ.. జిల్లా వ్యాప్తంగా వైద్య సిబ్బంది శనివారం రోడ్డెక్కి నిరసన కార్యక్రమం చేపట్టారు. అన్ని దవాఖానల్లో ఓపీ సేవలను బంద్ చేశారు. హంతకులను గుర్తించి కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి, బాన్సువాడతోపాటు ఎల్లారెడ్డి, మద్నూర్, బిచ్కుంద, డోంగ్లీ తదితర దవాఖానల్లో సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కామారెడ్డిలో ఐఎంఏ, ఐడీఏ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒక్క రోజు విధులను బహిష్కరించి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైద్య విద్యార్థినిపై లైంగికదాడి చేసిన నిందితులను వంద రోజుల్లో ఉరి తీయాలని అన్నారు. ఇంత దారుణం జరిగినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రమణ, కార్యదర్శి డాక్టర్ అరవింద్ గౌడ్, వైద్యులు రామలింగం, వెంకటరాజ్యం, మల్లికార్జున్, రమేశ్‌బాబు, వెంకటేశ్వర్‌గౌడ్, శ్రీలీల, ఉమాజనార్దన్, రాజలక్ష్మి, ఇండియన్ డెంటల్ సోసియేషన్ అధ్యక్షులు మాధవి లత, కార్యదర్శి అభిషేక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వైద్య విద్యార్థినిపై లైంగికదాడి చేసిన నిందితుడిని శిక్షించాలని ఐఎంఏకు మద్దతుగా కామారెడ్డి ప్రైవేట్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రైవేట్ హాస్పటల్స్ యూనియన్ సభ్యులు మారుతి, గోపాల్‌రావు, వంశీ కృష్ణ, అశోక్, బోగి రవి, నర్సింహులు, ప్రవీణ్, మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు. బాన్సువాడలోని ప్రభుత్వ దవాఖానలో వైద్యులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వ మాతా శిశు దవాఖాన నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు కలిసి బాన్సువాడలోని అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహిం చారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీనివాస్ ప్రసాద్, సంతోష్‌రెడ్డి, కిరణ్‌కుమార్, అనిల్‌రెడ్డి, రతన్ సింగ్, జీవన్, రాకేశ్, సాయిలు, స్వాతి, సౌజన్య, సంగ్రాం రాథోడ్, శ్రీలత, వాగ్దే వి, రోహిణి, స్టాఫ్ నర్సులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, పట్టణ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్, బీజేపీ నాయకులు గంగారెడ్డి, అరవింద్, చిరంజీవి, విశాల్, ఆశ్విన్, సిద్ధార్థ, సుధాకర్‌గౌడ్, దత్తు, శంకర్, గంగారాం, భూమేశ్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిలో డాక్టర్లు, వైద్యసిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. మద్నూర్ వైద్య విధాన పరిషత్, డోంగ్లీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు ఓపీ సేవలను నిలిపివేసి నిరసన వ్యక్తంచేశారు. బిచ్కుందలో వైద్యులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలను ధరించి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ భరత్, విజయ, నాగమణి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.


మద్నూర్‌లో నిరసన తెలుపుతున్న సిబ్బంది





బాన్సువాడ, ఎల్లారెడ్డిలో నిరసన వ్యక్తం చేస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది


బిచ్కుందలో నిరసన తెలుపుతున్న సిబ్బంది

## డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న డీఎస్పీ సోమనాథం

కామారెడ్డి, ఆగస్టు 17 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీఎస్ నాబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాల గురించి శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సోమనాథం మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా, డ్రగ్స్ నిర్మూలించడానికి నడుంబిగించాలని అన్నారు. డ్రగ్స్ తీసుకుంటే కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు. విద్యార్థులు దురలవాట్లకు లోను కాకూడదని అన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన వివరాలు తెలిస్తే 'డయల్ 100' లేదా టోల్ ఫ్రీ నంబర్ 14446కి సమాచారం అందించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రామన్, దేవునిపల్లి ఎస్సై రాజు, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో రక్షాబంధన్


ఘన్‌పూర్ పాఠశాలలో రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థులు

బాన్సువాడ రూరల్/మాచారెడ్డి, ఆగస్టు 17 : బాన్సువాడ మండలం బోర్లం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం రక్షాబంధన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అక్కా తమ్ముడి అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించేలా రక్షాబంధన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యార్థినులు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ, ఉపాధ్యాయులు పద్మ శ్రీనివాస్, నర్సింహాచారి, సంగమేశ్వర్, ఆనంద్ కుమార్, గంగాధర్, శ్రావణ్‌కుమార్, శీలా తదితరులు పాల్గొన్నారు. మాచారెడ్డి మండలం ఘన్‌పూర్ ఉన్నత పాఠశాలలో రక్షబంధన్ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శారద, ఉపాధ్యాయులు సంతోష్, మంజురాణి, అంజలి, గోపాలకృష్ణ, రమాదేవి, రజిత పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

కామారెడ్డి రూరల్, ఆగస్టు 17 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని నరసన్నపల్లి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నరసన్నపల్లిలో బస్సు షెల్టర్ దగ్గర ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన విషయం తెలియగానే వెంటనే అక్కడికి వెళ్లి పరిశీలించామన్నారు. మృతిని కుడి చేయిపై జస్వంత్ అని హిందీలో పచ్చబొట్టుతో ఉన్నదని తెలిపారు.

## నేడు పీఆర్టీయూ జిల్లా సర్వసభ్య సమావేశం

కామారెడ్డి, ఆగస్టు 17 : జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో పీఆర్టీయూ కామారెడ్డి జిల్లా శాఖ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు, శాసనమండలి సభ్యులు కూర రఘోత్తమరెడ్డి, మాజీ శాసన మండలి సభ్యులు మోహన్‌రెడ్డి, రవీందర్ హాజరవుతారని తెలిపారు. 23 మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ప్రాథమిక సభ్యులు హాజరుకావాలని కోరారు.

## ఎమ్మెల్యే పోచారానికి ఆహ్వాన పత్రిక అందజేత

బాన్సువాడ, ఆగస్టు 17 : శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీ సరస్వతీ ఫంక్షన్‌హాల్‌లో సెప్టెంబర్ 4వ తేదీన నిర్వహించే శ్రీకృష్ణ ఉత్సవ కార్యక్రమానికి రావాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని ఇస్కాన్ ప్రతినిధులు శనివారం బాన్సువాడలోని ఆయన స్వగృహానికి వెళ్లి ఆహ్వానించారు. కామారెడ్డి ఇస్కాన్ జిల్లా ప్రతినిధి వెంకటదాసు ప్రభూజి, అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు ముదిరెడ్డి విఠల్‌రెడ్డి, బాన్సువాడ ఇస్కాన్ ప్రతినిధులు పిన్నూరి మల్లికార్జున్, ఉప్పల లక్ష్మణ్‌గుప్తా, సాయిలు ఉన్నారు.

**ఆలయంలో ప్రత్యేక పూజలు**

నస్రుల్లాబాద్, ఆగస్టు 17 : బీర్కూర్ తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రావణ మాసం రెండో శనివారం సందర్భంగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

## విద్యార్థినులకు అవగాహన


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మాచారెడ్డి, ఆగస్టు 17 : పాల్వంచ మండలం ఆరేపల్లి స్టేజి వద్ద ఉన్న కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు కామారెడ్డి సఖీ భరోసా సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పించారు. షీటీం, సైబర్‌క్రైమ్, రోడ్ సేఫ్టీ, బాల్యవివాహాలు, మానవ అక్రమ రవాణా నిర్మూలన, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. 100, 108, 1930, 181 నంబర్ల గురించి వివరించారు. కార్యక్రమంలో వసతి గృహం, సఖీ భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

బాన్సువాడ, ఆగస్టు 17 : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కౌన్సిలర్ శ్రీనివాస్ కాలనీవాసులకు సూచించారు. శనివారం ఆయన వనమహోత్సవంలో భాగంగా కాలనీలో మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.

## ఒకరి బైండోవర్

కామారెడ్డి రూరల్, ఆగస్టు 17 : కామారెడ్డి పట్టణం దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన షబ్బీర్ అనే వ్యక్తి తాగిన మైకంలో శుక్రవారం రాత్రి 'డయల్ 100'కు ఫోన్ చేశాడని దేవునిపల్లి ఎస్సై రాజు శనివారం తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరం ఉన్న వారికి కాకుండా ఇలా సమయాన్ని వృథా చేసినందుకు శనివారం అతడిని స్థానిక కామారెడ్డి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు.

# రుణమాఫీపై సమాధానం చెప్పేదెవరు..?


నాగిరెడ్డిపేట వ్యవసాయ కార్యాలయం ఎదుట అధికారుల కోసం నిరీక్షిస్తున్న రైతులు

నాగిరెడ్డిపేట, ఆగస్టు 17: రాష్ట్ర ప్రభుత్వం మూడో విడుత రుణమాఫీని గురువారం ప్రకటించింది. దీంతో రైతులు బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల వద్ద శనివారం బారులు తీరారు. బ్యాంకు సిబ్బంది రుణమాఫీ కాని వారి వివరాలు తెలుపడంతో వారు వ్యవసాయాధికారి కార్యాలయానికి పరుగులు తీశారు. కాగా నాగిరెడ్డిపేట వ్యవసాయాధికారి కార్యాలయంలో మధ్యాహ్నం మూడు గంటల వరకూ ఒక్క అధికారి, సిబ్బంది కూడా రాలేదు. ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు.

## ఓటరు జాబితాను సిద్ధం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీవో ప్రకాశ్

ఎల్లారెడ్డి, ఆగస్టు 17: నియోజక వర్గ పద్ధతిలో ఉన్న ఓటరు జాబితాను గ్రామ పంచాయతీల వారీగా సిద్ధం చేయాలని ఎల్లారెడ్డి ఎంపీవో ప్రకాశ్ అన్నారు. ఎల్లారెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఉన్న ఓటరు జాబితాను ఆయా గ్రామ పంచాయతీల వారీగా తయారు చేయాలన్నారు. ఒకే ఇంటికి సంబంధించి వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓటర్లను ఆయా వార్డులకు అనుగుణంగా మ్యాపింగ్ స్టేట్‌మెంట్ తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. రెండు రోజుల్లో ఓటరు జాబితాను సిద్ధం చేయాలని పేర్కొన్నారు.

## బాధితుడికి సెల్‌ఫోన్ అందజేత

ఎల్లారెడ్డి, ఆగస్టు 17: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన గుంటిగారి సురేందర్‌కు ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ శనివారం అందజేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో సెల్‌ఫోన్ ఆచూకీ కనుగొని స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. దానిని బాధితుడికి అందజేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుంటే వెంటనే పూర్తి వివరాలతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి దానిని స్వాధీనం చేసుకుంటామన్నారు.

# తూతూ మంత్రంగా అమ్మ ఆదర్శ పాఠశాల పనులు


సున్నం వేసిన పాత వాటర్ ట్యాంకులు


కస్తూర్బాలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో రాజు

రామారెడ్డి, ఆగస్టు 17: తూతూ మంత్రంగా అమ్మ ఆదర్శ పాఠశాల పనులు చేపట్టారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. రామారెడ్డి బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌లో అధికారులను వారు నిలదీశారు. రామారెడ్డి బాలికల ఉన్నత పాఠశాలలో మరమ్మతుల కోసం లక్షా 60 వేల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. పనులు చేయకుండానే పాత వాటికి పూతపెట్టి డబ్బులు డ్రా చేసుకున్నారని పేర్కొన్నారు. పేరెంట్స్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయకుండానే

**విద్యాధికారుల ఎదుట తల్లిదండ్రుల ఆవేదన**

హెడ్‌మాస్టర్ మురళి బిల్లులు తీసుకున్నాడని తల్లిదండ్రులు ఆరోపించారు. సమావేశానికి హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి రాజు ఎదుట ఆవేదన వ్యక్తంచేశారు. పాఠశాలలో 320మంది విద్యార్థినులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఇసుకతో కూడిన దొడ్డు బియ్యం వస్తున్నదని, మధ్యాహ్న భోజనం మెనూ బోర్డు ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. అనంతరం డీఈవో రామారెడ్డి కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. కిటికీలకు జాలీ మెష్ ఏర్పాటు చేయాలని, త్వరలో వైద్య శిబిరం నిర్వహించి విద్యార్థినులకు పరీక్షలు చేయించాలని, వంట గదిని పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారిణికి సూచించారు. కార్యక్రమంలో డీఈవోతోపాటు మండల విద్యాధికారి యోసెఫ్, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ ఆనంద్, ఇన్‌చార్జి హెచ్‌మాస్టర్ వీరయ్య, చైర్‌పర్సన్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, యూత్ నాయకులు ఉన్నారు.

## ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నిజాం


బాధ్యతలను స్వీకరిస్తున్న నిజాం

ఎల్లారెడ్డి, ఆగస్టు 17: ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నిజాం శనివారం బాధ్యతలను స్వీకరించారు. బదిలీపై వచ్చిన ఆయన ఇప్పటి వరకు ప్రిన్సిపాల్ పనిచేసిన హేమచందర్ నుంచి బాధ్యతలను తీసుకున్నారు. కార్యక్రమంలో కాలేజీ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసాచారి, పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నలుగురికి ఏఎల్ఎమ్‌గా ప్రమోషన్


ప్రమోషన్ కాపీలను అందజేస్తున్న ఏఈ మనోరంజన్‌రెడ్డి

నాగిరెడ్డిపేట, ఆగస్టు 17: మండలంలో విధులు నిర్వహిస్తున్న నలుగురికి జేఎల్‌మ్ నుంచి ఏఎల్‌ఎమ్‌గా ప్రమోషన్ లభించింది. దీంతో వారికి ఏఈ మనోరంజన్‌రెడ్డి నియామకపత్రాలను అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ప్రమోషన్ పొందిన వారిలో వెంకటేశ్, కరుణాకర్, ప్రసాద్, కృష్ణ ఉన్నారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ సురేందర్, లైన్‌మెన్ శశికాంత్‌రెడ్డి, రాములు తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**LAND FOR SALE**

★6.5 Acres Agriculture Land for Sale at Uddemarri (V), Mudichintalapalli (M), Medchal-Malkajgiri Dist., 9 Kms. from Shamirpet to Keesara Main Rd., Clear Title, Brokers excuse. Ph: 9542421000, 9848016513.
NT-326630

**WANTED**

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-325790-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
GST వర్తించును

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


## నాగిరెడ్డి పేట ఏవో బదిలీ

నాగిరెడ్డిపేట, ఆగస్టు17: మండల వ్యవసాయ శాఖ అధికారి విజయశేఖర్, ఏఈవోలు నిఖిత, బబిత బదిలీ అయ్యారని ఏడీఏ వీరాస్వామి శనివారం తెలిపారు. ఏవో విజయశేఖర్ నిజామాబాద్ డీఏవో కార్యాలయానికి, ఏఈవోలు నిఖిత, బబిత రామారెడ్డి మండలానికి బదిలీపై వెళ్లారన్నారు.

## టీచర్లకు సన్మానం


నాగిరెడ్డిపేట, ఆగస్టు17: మండలంలోని పోచారం ప్రాథమికోన్నత పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను శనివారం స్థానిక మాజీ సర్పంచ్ ఆకిరెడ్డిగారి విజిత, నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి సన్మానించారు. వారికి శాలువా కప్పి సత్కరించారు. హెచ్‌ఎం రాములు, ఉపాధ్యాయులు రాజమణి, అనురాధ, సుమిత్ర, మీరాబాయి అందించిన సేవలను కొనియాడారు. హెచ్‌ఎం షఫిక్ ఉన్నీసా బేగం, ఉపాధ్యాయురాలు శ్రీలత పాల్గొన్నారు.

## ఈ-పాస్ యంత్రాల ద్వారా ఎరువులను విక్రయించాలి


ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏవో

లింగంపేట, ఆగస్టు 17: ఫర్టిలైజర్ దుకాణాల్లో ఈ-పాస్ యంత్రాల ద్వారా ఎరువులను విక్రయించాలని మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి, నల్లమడుగు, లింగంపేటలోని ఎరువుల దుకాణాలను ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ వివరాలను పరిశీలించారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పకుండా బిల్లులు ఇవ్వాలని, ఆధార్ కార్డు ఆధారంగా రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఫర్టిలైజర్ దుకాణాల యజమానులకు సూచించారు. ఆయనతోపాటు నల్లమడుగు, శెట్పల్లిసంగారెడ్డి సహకార సంఘాల సీఈవోలు మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్, వ్యాపారులు ఉన్నారు.

## బల్దియా సిబ్బందికి సన్మానం


బల్దియా కమిషనర్ శ్రీహరిరాజు, సిబ్బందిని సన్మానిస్తున్న కౌన్సిలర్లు

ఎల్లారెడ్డి, ఆగస్టు 17: ఉత్తమ సేవలను అందించి అవార్డులు అందుకున్న బల్దియా సిబ్బందిని పట్టణ కౌన్సిలర్లు సన్మానించారు. ఎల్లారెడ్డి మున్సిపాలిటీ కమిషనర్ శ్రీహరి రాజు, జూనియర్ అసిస్టెంట్ అంజయ్య, కంప్యూటర్ ఆపరేటర్ ప్రదీప్‌కుమార్ జిల్లాకేంద్రంలో శుక్రవారం అవార్డులు అందుకున్నారు. దీంతో ఎల్లారెడ్డిలో శనివారం వారికి శాలువాలు కప్పి సత్కరించారు. కౌన్సిలర్లు పద్మ శ్రీకాంత్, విద్యాసాగర్, శ్రావణ్ కుమార్, శ్రీనివాస్, నాయకులు ప్యాలాల రాములు, సిద్ధి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## సోదరభావానికి ప్రతీక రక్షాబంధన్


అధికారులకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి

బిచ్కుంద, ఆగస్టు 17: సోదరభావానికి ప్రతీక రక్షాబంధన్ అని బ్రహ్మకుమారి ఉషాకుమారి అన్నారు. రాఖీపౌర్ణమిని పురస్కరించుకొని తహసీల్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ క్రాంతికుమార్‌తోపాటు ఆర్ఐ రవీంద్రనాథ్, రెవెన్యూ సిబ్బందికి శనివారం రాఖీలు కట్టారు. మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, కుశాల్, సంగ్రామ్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక స్కాలర్స్ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ సత్యవీర్ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు.